సాక్షి జగిత్యాల

బుధవారం ¦ 6 ¦ డిసెంబర్ ¦ 2023



కుజదోష నివారణ పూజలు

ధర్మపురి: నృసింహస్వామి సన్నిధిలో కుజదోష నివారణ పూజలు నిర్వహించారు. ఆలయాల్లో మొక్కులు సమర్పించారు.



బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక

ఉమ్మడి కరీంనగర్ జిల్లా అండర్ 14, 17 ఏళ్ల బాలబాలికల బాస్కెట్‌బాల్ జట్లను మంగళవారం ఎంపిక చేశారు. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 29.0/19.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో చాలాచోట్ల చిరుజల్లులు, కొన్నిచోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జిల్లాకు వర్ష సూచన

జగిత్యాలఅగ్రికల్చర్: రాబోయే ఐదు రోజుల్లో జిల్లాలో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని పొలాస వ్యవసాయ పరిశోధన స్థానం డైరెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. డిసెంబర్ 6 నుంచి 10వరకు పగటి ఉష్ణోగ్రతలు 27 నుంచి 30డిగ్రీలుగా.. రాత్రి ఉష్ణోగ్రత 19 నుంచి 21డిగ్రీలుగా నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. గాలిలో తేమ శాతం ఉదయం 83 నుంచి 88 శాతం, మధ్యాహ్నం 77 నుంచి 91 శాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఈశాన్య దిశగా ఈదురుగాలులు గంటలకు 6 నుంచి 19 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని పేర్కొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పదవికి రాజీనామా



రాజీనామాపత్రం అందిస్తున్న రాధ

జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పదవికి జగిత్యాలరూరల్ మండలం అంతర్గాం గ్రామానికి చెందిన నక్కల రాధ మంగళవారం రాజీనామా చేశారు. ఈ మేరకు మార్కెట్ సెక్రటరీ రాజశేఖర్‌కు రాజీనామా పత్రం అందించారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారినందున నైతిక బాధ్యత వహిస్తూ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఆమె ప్రకటించారు. ఇంతవరకు సహకరించిన ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ కవిత, మార్కెట్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

అల్లీపూర్‌లో పొలాస శాస్త్రవేత్తల రైతు సదస్సు



రైతు సదస్సులో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

జగిత్యాలఅగ్రికల్చర్: పొలాస వ్యవసాయ శాస్త్రవేత్తలు రాయికల్ మండలం అల్లీపూర్‌లో మంగళవారం రైతు సదస్సు నిర్వహించారు. ఆయా పంటల్లో ఎరువుల యజమాన్యం, సాగునీటి పద్ధతులపై వివరించారు. పంట వ్యర్థాలను భూమిలో కాలబెట్టే బదులు.. అదే భూమిలో కలియదున్నాలని, తద్వారా భూమిలో పోషకాలు పెరుగుతాయని శాస్త్రవేత్తలు వివరించారు. భూమి ఆరోగ్యానికి సంబంధించిన వివరాల కరపత్రాలను రైతులకు పంపిణీ చేశారు. శాస్త్రవేత్తలు రవి, సాయినాథ్, రజనీకాంత్, బలరాం భూమి ఆరోగ్యం–పరిరక్షణపై వివరించారు. కార్యక్రమం ఇన్‌చార్జి రజనీదేవి, రైతులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీలకు భూషణరావుపేట విద్యార్థులు



విద్యార్థిని హేమశ్రీని అభినందిస్తున్న పీఈటీ వినోద్

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట జెడ్పీ హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి విద్యార్థిని మొగిలి హేమ శ్రీ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ వినోద్ తెలిపారు. ఈనెల 7 నుంచి హన్మకొండలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో లాంగ్‌జంప్ విభాగంలో జిల్లా తరఫున హేమశ్రీ పాల్గొంటారని పేర్కొన్నారు. విద్యార్థినిని హెచ్‌ఎం రాజయ్య, ఉపాధ్యాయ బృందం అభినందించింది.

ఉపాధ్యాయులు లేరని ఆందోళన



నిరసన తెలుపుతున్న విద్యార్థులు

కొండగట్టు(చొప్పదండి): కొడిమ్యాల మండలంలోని ఆదర్శ పాఠశాలలో సబ్జెక్టు టీచర్లు లేక పాఠాలు బోధించడం లేదని పేర్కొంటూ విద్యార్థులు మంగళవారం ధర్నాకు దిగారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ టీచర్లు లేక పదో తరగతి పాఠాలు జరగడం లేదని తెలిపారు. విద్యా సంవత్సరం పూర్తికావస్తున్నా.. పాఠాలు చెప్పకుంటే తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. తరగతులు బహిష్కరించి పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టారు. ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు.

నిర్వహణ లోపం.. బాలింతల్లో కలవరం



వైద్యం పొందుతున్న మహిళలు

‘ధర్మపురికి చెందిన ఓ గర్భిణి వారం క్రితం ప్రసవం కోసం జిల్లాకేంద్రంలోని మాతాశిశు సంక్షేమ కేంద్రానికి వచ్చింది. పరీక్షించిన వైద్యులు నార్మల్ డెలివరీ కాదని భావించి ఆమెకు సిజేరియన్ చేసి ఆడశిశువుకు పురుడుపోశారు. అంతలో ఏమైందో తెలియదుగానీ ఆమెకు బ్లీడింగ్ ఎక్కువ కావడంతో కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడా నయం కాకపోవడంతో ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ చనిపోయింది. ఫలితంగా ఆ శిశువుకు తల్లిలేకుండా పోయింది.

- ‘మాతాశిశు’లో పెరుగుతున్న మరణాలు
- వైద్యుల నిర్లక్ష్యమే కారణమా..?
- ప్రతినెలా 400కు పైగా ప్రసవాలు
- ప్రసవాలకు మహిళల వెనుకడుగు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని మాతాశిశు సంక్షేమ కేంద్రానికి రావాలంటేనే గర్భిణులు జంకుతున్నారు. వైద్యుల నిర్లక్ష్యమో..? సిజేరియన్లకు సంబంధించిన కారణమో..? తెలియదుగానీ ఈ కేంద్రంలో ఇన్ఫెక్షన్లు రోజురోజుకూ పెరుగుతున్నాయి. డెలివరీ అయ్యాక కూడా ఇన్ఫెక్షన్లు పెరగడంతో గతంలో ఐదుగురు బాలింతలు మృతిచెందారు. ఈ సంఘటనలన్నీ కళ్లముందే ఉండడం.. నిత్యం గర్భిణులకు ఏదో ఒకటి జరగడంతో ఆస్పత్రికి రావడానికే వెనుకంజ వేసే పరిస్థితి తలెత్తుతోంది. అదే సమయంలో ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్తున్నవారి సంఖ్య పెరుగుతోంది.



జిల్లాకేంద్రంలోని మాతాశిశు సంక్షేమ కేంద్రం

400కు పైగా డెలివరీలు

మాతాశిశు సంక్షేమ కేంద్రంలో నెలకు సుమారు 400కు పైగా ప్రసవాలు జరుగుతున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రికి గర్భిణుల తాకిడి ఎక్కువ అయినప్పటికీ కొంత సిబ్బంది నిర్లక్ష్యంతో వారికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనికి వైద్యుల నిర్లక్ష్యమా..? అందులో పనిచేస్తున్న సిబ్బంది నిర్లక్ష్యమా..? తెలియదుగానీ ఇన్ఫెక్షన్లతో భయాందోళనకు గురవుతున్నారు. మాతాశిశు సంక్షేమ కేంద్రంలో ప్రతి గర్భిణి వివరాలను రికార్డు చేయాల్సి ఉంటుంది. వచ్చిన ప్రతి గర్భిణి థంబ్ ద్వారా చేర్పించుకోవాల్సి ఉన్నా.. సిస్టమ్స్ లేకపోవడం.. ఎక్కువగా రికార్డు చేసుకోవాలంటే చాలా సమయం పడుతుండడంతో ఆ ప్రక్రియను పక్కనపెట్టారు.

గర్భిణుల్లో భయాందోళన

మాతాశిశు సంక్షేమ కేంద్రంలో ఇటీవల బాలింతలు చనిపోవడం.. ఇన్ఫెక్షన్లకు గురికావడంతో మిగిలిన వారిలో భయందోళన వ్యక్తమవుతోంది. ముఖ్యంగా సిజేరియన్ జరిగిన అనంతరం ఇన్ఫెక్షన్ సోకకుండా అనేక జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. సిజేరియన్ సెట్ కొత్తవి వాడడంతోపాటు పూర్తిస్థాయిలో స్టెరిలైజేషన్ చేయాలి. అయితే మాతాశిశు కేంద్రంలో ఆపరేషన్ సెట్లు తక్కువగా ఉండటం, ఎక్కువ సంఖ్యలో గర్భిణులు వస్తుండడంతో ఇన్ఫెక్షన్‌లు సోకుతున్నాయనే ఆరోపణలున్నాయి. ఇటీవల వైద్యుల నిర్లక్ష్యంతో ఓ మహిళకు ఆపరేషన్ చేసి కడుపులోనే గుడ్డపెట్టి కుట్లు వేసిన విషయం వెలుగుచూసింది. ఆమెకు ఇన్ఫెక్షన్ సోకి చనిపోయింది. కారణమేదైనా ఆసుపత్రిలో బాలింతలు మృతిచెందుతుండడం.. ఇన్ఫెక్షన్‌లు సోకుతుండడంతో ఆస్పత్రికి వచ్చేందుకే జంకుతున్నారు.

> **నిత్యం పర్యవేక్షిస్తున్నం**
>
> గర్భిణులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. కొన్ని సంఘటనల వల్ల ఆసుపత్రికి వచ్చే గర్భిణుల సంఖ్య తగ్గింది. ఇప్పుడు గర్భిణులకు అవగాహన కల్పిస్తున్నాం. వారికి ఇబ్బంది రాకుండా చూస్తాం. ప్రభుత్వ ఆస్పత్రిలో డెలివరీ చేసుకుంటే మంచిది.
>
> – రాములు, ఆస్పత్రి సూపరింటెండెంట్

ప్రైవేటులో పెరుగుతున్న ప్రసవాల సంఖ్య

ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని వసతులు కల్పించడంతో ప్రసవాలు పెరుగుతున్నాయి. బాలింతలు చనిపోతుండడంతో రెండు నెలల క్రితం జిల్లా కలెక్టర్ యాస్మిన్ బాషా ఆసుపత్రిని సందర్శించి సిజేరియన్లు చేయొద్దని, సాధారణ ప్రసవాలకే మొగ్గు చూపాలని ఆదేశించారు. అదే సమయంలో ప్రసవం కోసం గర్భిణులు ప్రైవేటుకు వెళ్లకుండా ప్రభుత్వ ఆసుపత్రిలోనే మెరుగైన సేవలందించాలని కూడా సూచించారు. తాజాగా జరుగుతున్న మరణాల నేపథ్యంలో కలెక్టర్ స్పందించి బాలింతలకు ఇన్ఫెక్షన్లు సోకకుండా చూడాలని ఆదేశాలు ఇవ్వడంతోపాటు అన్ని సౌకర్యాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

‘హస్త’వాసి బాగుంది!

- ప్రభుత్వ వ్యతిరేకత, పోరాటాలతో 8 సీట్లు కైవసం
- బలంగా పని చేసిన సానుభూతి, ఆరు పథకాలు
- నిరాశపరిచిన హుజూరాబాద్, జగిత్యాల ఫలితాలు
- ఉత్సాహం నింపిన రాహుల్‌గాంధీ, రేవంత్, భట్టి పర్యటనలు
- నాలుగు స్థానాల్లో కాంగ్రెస్ విజయావకాశాలకు బీజేపీ గండి
- నిజమైన ‘సాక్షి’ కథనం

సాక్షిప్రతినిధి, కరీంనగర్: కాంగ్రెస్ పార్టీ నేతల హస్తవాసి బాగుంది. అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఫలితాల్లో చేతిగుర్తు లీడర్లకు, కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం వచ్చింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో దక్కిన ఈ విజయం కేడర్‌లో కొత్త ఉత్సాహం నింపింది. అయితే, ఇవన్నీ ఒక్క రోజులో జరిగినవి కావు. పకడ్బందీ ప్రణాళికతో ఈరోజు పటిష్ట స్థితికి చేరుకోగలిగింది.

13 నియోజకవర్గాల్లో మీటింగ్‌లు

కాంగ్రెస్ ఉమ్మడి జిల్లాలోని 13 నియోజకవర్గాల్లో 8 సీట్లు కైవసం చేసుకుంది. ప్రచారంలో ఆ పార్టీ ఇచ్చిన హామీలు, అనుసరించిన వ్యూహాలు, 6 గ్యారంటీ పథకాలను పక్కాగా ప్రజల్లోకి తీసుకెళ్లగలగడం, అగ్రనేతల పర్యటనలు కేడర్‌లో ఆత్మస్థైర్యాన్ని నింపాయి. భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ పేరిట ఆదిలాబాద్ నుంచి మధిర వరకు చేపట్టిన పాదయాత్ర ఉమ్మడి జిల్లాలోని నియోజకవర్గాల మీదుగా సాగింది. దీనికి జాతీయ నాయకులు హాజరవడం కేడర్‌లో ఐక్యతను పెంచింది. తర్వాత రేవంత్‌రెడ్డి వరుస మీటింగ్‌లు, రాహుల్ గాంధీ పర్యటనలు మరింత జోష్ పెంచాయి.

ప్రభుత్వ వ్యతిరేకత, ధరణి సమస్యలు

ఇదే సమయంలో టీఎస్‌పీఎస్సీ కుంభకోణం, 317 జీవో అమలుతో వచ్చిన వ్యతిరేకత, ధరణిలో నెలకొన్న సమస్యలు ప్రభుత్వానికి తలనొప్పిగా మారాయి. వీటిని ఎండగట్టడంలో ఇక్కడి కాంగ్రెస్ నాయకులు సక్సెస్ అయ్యారు. అంతేకాకుండా టీఎస్‌పీఎస్సీ నిందితులుగా ఆరోపణలు ఎదుర్కొన్నవారు, సూత్రధారులు, పాత్రధారులు సైతం ఉమ్మడి జిల్లాకు చెందినవారు కావడం ఇక్కడ కారు పార్టీ ప్రతిష్ఠ మసకబారేలా చేసింది. దళిత బంధు, బీసీ బంధు, మైనార్టీ బంధు పథకాల అమలులో అవినీతి, అనుచరులకే ఇస్తామంటూ నేతల బహిరంగ వ్యాఖ్యలు హస్తం పార్టీకి కలిసివచ్చాయి. ఎన్నికల మేనిఫెస్టో రూపొందించాక.. 6 గ్యారంటీ పథకాలకు విస్తృత ప్రచారం, బీఆర్‌ఎస్, బీజేపీ ఒకటేనన్న నినాదాన్ని జనాల్లోకి తీసుకెళ్లడంలో కిందిస్థాయి కేడర్ సఫలీకృతులయ్యారు. వీటికి ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ నాయకులపై ప్రజలకు ఉన్న సానుభూతి జత కలిసింది. ఫలితంగా మంచి మెజారిటీతో కాంగ్రెస్ అభ్యర్థులు విజయతీరాలకు చేరారు.



ఆరైనా ‘హస్తగతం’ కావాలి

ఆగస్టు 26న ‘సాక్షి’ ప్రచురించిన కథనం

దెబ్బతీసిన బీజేపీ, ఇండిపెండెంట్లు..

వాస్తవానికి ఈసారి ఎన్నికల్లో బీజేపీ బలమైన అభ్యర్థులను రంగంలోకి దించడం పరోక్షంగా కాంగ్రెస్ పార్టీకి చేటు చేసింది. దీనికి స్వతంత్రులు సైతం తోడయ్యారు. ఒక్క సిరిసిల్ల మినహా కోరుట్ల, జగిత్యాల, కరీంనగర్, హుజూరాబాద్‌లో బీజేపీ బలం, చీలిన ప్రభుత్వ వ్యతిరేక ఓటు కాంగ్రెస్‌ను ఓటమిపాలు చేశాయి. బీఆర్‌ఎస్ గెలిచిన 5 స్థానాల్లోనూ కాంగ్రెస్‌కు బలమైన అభ్యర్థులు ఉన్నారు. జగిత్యాలలో మాజీ మంత్రి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, కోరుట్లలో జువ్వాడి నర్సింగరావు, హుజూరాబాద్‌లో ఒడితెల ప్రణవ్ ఓటమికి కమలం పార్టీ అభ్యర్థులు చీల్చిన ప్రభుత్వ వ్యతిరేక ఓట్లే కారణమని కాంగ్రెస్ సీనియర్లు అభిప్రాయపడుతున్నారు. అదే సమయంలో పెద్దపల్లి జిల్లాలోని రామగుండం, పెద్దపల్లి, మంథని నియోజకవర్గాల్లో ఆ పార్టీ అభ్యర్థులు గెలిచి, క్లీన్ స్వీప్ చేశారు. ఈ మూడు నియోజకవర్గాల్లో ఎక్కడా బీజేపీ బలమైన అభ్యర్థులను నిలబెట్టలేకపోయిందని, ఇందుకు ఆ పార్టీకి వచ్చిన ఓట్లే నిదర్శనమని అంటున్నారు.

> **నిజమైన సాక్షి కథనం...**
>
> ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ తరఫున పోటీ చేస్తున్న ఆది శ్రీనివాస్–వేములవాడ, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్–ధర్మపురి, మక్కాన్ సింగ్–రామగుండం, శ్రీధర్‌బాబు–మంథని, జీవన్‌రెడ్డి–జగిత్యాల, పొన్నం ప్రభాకర్–హుస్నాబాద్ గెలుస్తారని, ఆ దిశగా పార్టీ ప్రణాళికతో సాగుతోందని ‘ఆరైనా హస్తగతం కావాలి’ అన్న శీర్షికన గత ఆగస్టు 26న ‘సాక్షి’ దినపత్రికలో కథనం ప్రచురితమైంది. అదే నిజమైంది. అయితే, హోరాహోరీ పోరులో జగిత్యాల సీటు కాంగ్రెస్ చేజారగా, అదనంగా పెద్దపల్లి, మానకొండూరు, చొప్పదండి స్థానాలు ఆ పార్టీ ఖాతాలో చేరడం గమనార్హం. మాజీ ఎంపీ వివేక్ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుంటారన్న విషయాన్నీ ఇదే కథనంలో ప్రస్తావించిన విషయం విధితమే.

బీఆర్‌ఎస్ గెలిచినచోట బీజేపీకి వచ్చిన ఓట్లు

కరీంనగర్: గంగుల కమలాకర్(బీఆర్‌ఎస్) :	92,179
బండి సంజయ్ (బీజేపీ) :	89,016
హుజూరాబాద్: పాడి కౌశిక్‌రెడ్డి(బీఆర్‌ఎస్) :	80,333
ఈటల రాజేందర్ (బీజేపీ) :	63,460
జగిత్యాల : సంజయ్‌కుమార్(బీఆర్‌ఎస్) :	70,243
బోగ శ్రావణి(బీజేపీ):	42,138
కోరుట్ల: కల్వకుంట్ల సంజయ్(బీఆర్‌ఎస్) :	72115
ధర్మపురి అర్వింద్ (బీజేపీ) :	61,810
సిరిసిల్ల: కేటీఆర్ (బీఆర్‌ఎస్) :	88,761
రాణీ రుద్రమదేవి (బీజేపీ) :	18,328



ఆలయం ముందు భక్తులు



క్యూలైన్‌లో భక్తులు

అంజన్నకు భక్తుల మొక్కులు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టులోని శ్రీఆంజనేయస్వామి వారిని మంగళవారం వేలాది మంది భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఆవరణతోపాటు క్యూలైన్లు భక్తులతో కిక్కిరిసిపోయాయి. బొజ్జ పోతన్న, ఘాట్‌రోడ్, వైజంక్షన్ వద్ద వాహనాలు కిక్కిరిసిపోవడంతో అదుపు చేయడంలో పోలీసులు విఫలమయ్యారు. దాదాపు 20వేలకు భక్తులు వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. భక్తుల ఏర్పాట్లను ఈవో వెంకటేశ్, ఏఈవో శ్రీనివాస్, సూపరింటెండెంట్ సునీల్, శ్రీనివాసశర్మ, ఆలయ అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండి సేవలందించారు.

నేల ఆరోగ్యాన్ని కాపాడాలి



ర్యాలీ నిర్వహిస్తున్న పొలాస వ్యవసాయ కళాశాల విద్యార్థులు

- వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ భారతీభట్

జగిత్యాలఅగ్రికల్చర్: నేల ఆరోగ్యాన్ని కాపాడాలని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ భారతీభట్ అన్నారు. ప్రపంచమృత్తిక దినోత్సవం సందర్భంగా పొలాస వ్యవసాయ కళాశాల దత్తత గ్రామమైన తక్కళ్లపల్లిలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. రైతులతో సమావేశమయ్యారు. రసాయన ఎరువులు మోతాదును మించి వాడుతుండటంతో సారవంతం కోల్పోతోందని, సేంద్రియ ఎరువులు వాడితేనే భూమి సారవంతంగా ఉంటుందని పేర్కొన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు సాయికుమార్, వేణుగోపాల్, మహేశ్, సంపత్, ఎల్లాగౌడ్, సుష్మాదేవి భూమిని ఆరోగ్యంగా ఉంచేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. అనంతరం రైతులకు భూసార పరీక్షా ఫలితాల కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో దత్తత గ్రామ ఇన్‌చార్జి, ప్రొఫెసర్ గౌరీశంకర్, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ హరినాథబాబు, గ్రామ సర్పంచ్ జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

సమన్వయంతోనే ఎన్నికలు ప్రశాంతం



బీఎస్‌ఎఫ్ అధికారులను సన్మానిస్తున్న ఎస్పీ



పాల్గొన్న పోలీస్ అధికారులు

- ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

జగిత్యాలక్రైం: అసెంబ్లీ ఎన్నికలను అధికారులు, సిబ్బంది సమన్వయంతో ప్రశాంతంగా పూర్తి చేశామని జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ అన్నారు. జిల్లాకేంద్రంలోని ఓ గార్డెన్‌లో మంగళవారం జిల్లా పోలీస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి కౌంటింగ్ ప్రక్రియ ముగిసేవరకూ అధికారులు, సిబ్బంది క్రమశిక్షణతో అప్రమత్తంగా ఉన్నారని, సమర్థవంతంగా విధులు నిర్వహించడంతోనే ఎన్నికలు విజయవంతం అయ్యాయని అన్నారు. అవసరమైన చోటల్లా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహనాలను తనిఖీ చేశామని, మద్యం, నగదు వంటి అన్నిరకాల అక్రమ తరలింపును అడ్డుకున్నామని వివరించారు. జిల్లాలో విధులు నిర్వహించిన బీఎస్‌ఎఫ్ అధికారులను ఎస్పీ సన్మానించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు ప్రభాకర్‌రావు, భీంరావు, జనార్దన్ రెడ్డి, డీఎస్పీలు రవీందర్‌కుమార్, డీవీ.రంగారెడ్డి, సీఐలు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు, బీఎస్‌ఎఫ్ అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణను వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు

ధర్మపురి: విదేశాల నుంచి తిరిగి వచ్చి.. ఖాళీగా ఉన్న కార్మికులకు ఇస్తున్న ఉచిత ఉపాధి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మార్పీ జిల్లా అధ్యక్షుడు కాయితి శంకర్, మార్వాడి సుదర్శన్ తెలిపారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి ఐటీఎం సౌజన్యంతో నేషనల్ అకాడమీ కన్‌స్ట్రక్షన్ (న్యాక్) ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉచిత ఉపాధి శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. వీటిలో అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్లు 30, జనరల్ ప్లంబర్ 50 మంది, తాపీమేస్త్రీలు 60, సేటరింగ్ కార్పెంటర్ 50మందికి, బార్ బిల్డింగ్ అండ్ స్టీల్ ఫిక్సింగ్‌లో 60 మందికి 15 రోజులపాటు తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ఈనెల 8న సాయంత్రం 5 గంటలలోపు కలెక్టరేట్‌లోని ఎంప్లాయిమెంట్ కార్యాలయంలోగానీ న్యాక్ శిక్షణ కేంద్రం నూకపల్లిలోగానీ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. ఉచిత భోజన వసతి కల్పించి శిక్షణ కాలం పూర్తయిన తరువాత సర్టిఫికెట్లు అందించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 9491322556, 7036723800 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

అలుపెరగని పోరు.. అందిన విజయం

- పద్నాలుగేళ్లకు ‘అడ్లూరి’ని వరించిన విజయం
- కలిసొచ్చిన నాలుగుసార్లు ఓడిన సానుభూతి



విజయోత్సాహంతో అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

గొల్లపల్లి: అలుపెరగకుండా చేసిన పోరాటంలో చివరకు 14 ఏళ్లకు విజయం అందుకున్నారు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్. నాలుగుసార్లు ఓడిపోయినా ఆయన ప్రజల మధ్యనే ఉన్నారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు ఎత్తిచూపుతూ ముందుకెళ్లారు. అదే ఒరవడితో ప్రజల నుంచి సానుభూతితోపాటు మన్ననలు కూడా అందుకున్నారు. మొన్నటివరకు బీఆర్‌ఎస్‌కు కంచుకోటగా ఉన్న ధర్మపురి గడ్డపై తొలిసారి కాంగ్రెస్ జెండాను ఎగురవేశారు. 2009, 2010 (ఉపఎన్నిక), 2014, 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున బరిలో నిలిచిన అడ్లూరికి నిరాశే ఎదురైంది. నాలుగుసార్లు ఓడిన సానుభూతితోపాటు నియోజకవర్గంలో పర్యటిస్తూ సమస్యలపై గళమెత్తడం, కాంగ్రెస్ ప్రకటించిన ఆరుగ్యారంటీ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయడం ఆయనకు కలిసి వచ్చాయి.

సింగరేణి బిడ్డ నుంచి నాయకుడి వరకు

పెద్దపల్లి జిల్లాకు చెందిన అడ్లూరి.. విద్యార్థి దశనుంచే రాజకీయాల్లో చురుగ్గా పాల్గొన్నారు. విద్యార్థి నాయకుడు మొదలు.. మండల, జిల్లా, రాష్ట్రస్థాయి పదవుల్లో పనిచేశారు. 1982 నుంచి 85 వరకు ఎన్‌ఎస్‌యూఐ గోదావరిఖని జూనియర్ కాలేజీ అధ్యక్షుడిగా, 1986 నుంచి 94లో కరీంనగర్ జిల్లా జనరల్ సెక్రటరీగా, 1994 నుంచి 96 వరకు యూత్ కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రటరీగా, 1996 నుంచి 2001లో ఆంధ్రప్రదేశ్ జనరల్ సెక్రటరీగా కొనసాగారు. 2006లో ధర్మారం జెడ్పీటీసీగా అప్పటి ఎమ్మెల్యే, మాజీ మంత్రి మాతంగి నర్సయ్యపై విజయం సాధించారు. పునర్విభజనలో భాగంగా 2009లో ఏర్పడిన ధర్మపురి నియోజకవర్గం ఎస్సీ రిజర్వుడ్ కావడంతో కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యే బరిలో నిలిచి కొప్పుల ఈశ్వర్‌పై ఓటమి చెందారు. అప్పటినుంచి ఎమ్మెల్యేగా విజయం కోసం పోరాడుతూనే ఉన్నారు. 2010–12లో కరీంనగర్ జెడ్పీ చైర్మన్‌గా కొనసాగారు. 2013–14లో పీసీసీ జనరల్ సెక్రటరీగా.. ఆంధ్రప్రదేశ్ ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేశారు. 2014 ఎన్నికల్లోనూ కాంగ్రెస్ తరఫున పోటీచేసి ఓడిపోయారు. 2018లో నాల్గోసారి కూడా స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారు. అయినా పట్టువదలని విక్రమార్కుడిలా పోరాడుతూనే ఉన్నారు.

14 ఏళ్ల తర్వాత..

ఎన్ని అడ్డంకులు ఎదురైనా ప్రజల మధ్యే ఉన్న అడ్లూరికి ఈ సారి ఎన్నికల్లోనూ పోటీచేసే అవకాశం వచ్చింది. నాలుగుసార్లు ఓడిపోయిన సానుభూతి కలిసి రావడంతో 22,039 ఓట్ల మెజార్టీతో మంత్రి ఈశ్వర్‌పై విజయం సాధించారు. ఆపద వచ్చిన వారికి తను ఉన్నానంటూ కార్యకర్తలు, ప్రజలకు అండగా ఉంటారన్న పేరుకూడా ఉంది. ఎట్టకేలకు పద్నాలుగేళ్ల తర్వాత అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు ఎమ్మెల్యేగా గెలిచే అవకాశం జనం కల్పించారు.

ప్రజా విజయం: అడ్లూరి

ధర్మపురి లక్ష్మీ నరసింహుని ఆశీస్సులతో గెలపొందడం ఆనందంగా ఉంది. ఇది నియోజకవర్గ ప్రజలందరి విజయం. నిత్యం ప్రజల మధ్య ఉన్న వారినే ప్రజలు ఆశీర్వదించారు. ఇతర పార్టీల వారు ఎన్ని ఇబ్బందులు పెట్టినా.. ఎంత ప్రలోభాలకు గురిచేసినా.. ఒకే పార్టీ జెండా మోసిన నన్ను ప్రజలు నమ్ముకున్నారు. గెలుపులో శ్రమించిన అన్నివర్గాల ప్రజలకు పార్టీ నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు.

క్లుప్తంగా

హరీశ్‌రావును కలిసిన ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల: ఆరోగ్యశాఖ మాజీ మంత్రి హరీశ్‌రావును మంగళవారం జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కలిశారు. సంజయ్ విజయానికి సహకరించిన పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తలకు హరీశ్‌రావు కృతజ్ఞతలు తెలిపారు. జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధికి, బీఆర్ఎస్ బలోపేతానికి కృషిచేస్తానని పేర్కొన్నారు.

ప్రజల రుణం తీర్చుకోలేనిది

- ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ సతీమణి కాంతకుమారి


కాంతకుమారి

ధర్మపురి: అసెంబ్లీ ఎన్నికల్లో అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను గెలిపించిన ప్రజల రుణం తీర్చుకోలేనిదని లక్ష్మణ్‌కుమార్ సతీమణి కాంతకుమారి పేర్కొన్నారు. అడ్లూరి గెలుపులో పాలు పంచుకున్న ప్రతిఒక్కరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల సమయంలో తాము అండగా ఉంటామని ఆత్మస్థైర్యం నింపారని గుర్తుచేశారు. అభివృద్ధి పనులతో పాటు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు సలహాలు, సూచనలు అందించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


హన్మంతు మృతదేహం

మెట్‌పల్లి: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందినట్లు ఎస్సై చిరంజీవి మంగళవారం తెలిపారు. నిర్మల్ జిల్లాలోని వేణునగర్ గ్రామానికి చెందిన టేకం హన్మంతు, ఆత్రం నాగరావు, కొత్తపల్లి చందు సోమవారం సాయంత్రం ద్విచక్రవాహనంపై పనినిమిత్తం మెట్‌పల్లికి వచ్చారు. తిరిగి రాత్రి సమయంలో స్వగ్రామానికి వెళ్తుండగా రైల్వేవంతెన దాటిన తర్వాత క్రాసింగ్ వద్ద బైక్ అదుపు తప్పి కింద పడ్డారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన హన్మంతును ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య గంగవ్వ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఓపెన్ స్కూల్ పరీక్షల ఫలితాలు విడుదల

కరీంనగర్: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ 2023–24 సంవత్సరానికి గాను గత అక్టోబర్‌లో నిర్వహించిన ఓపెన్ పదో తరగతి, ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు మంగళవారం విడుదలైనట్లు డీఈవో జనార్దన్‌రావు, ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్ కో–ఆర్డినేటర్ నాగేశ్వర్‌రావు సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా నుంచి పదోతరగతి విద్యార్థులు 859 మంది హాజరు కాగా 233 మంది, ఇంటర్‌లో 1,116 మంది పరీక్షలు రాయగా 658 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. పదోతరగతి రీకౌంటింగ్ కోసం ఒక్కో సబ్జెక్టుకు రూ.350, రీవాల్యుయేషన్ కోసం రూ.1,200, ఇంటర్ రీకౌంటింగ్ కోసం ఒక్కో సబ్జెక్టుకు రూ.400, రీవాల్యుయేషన్ కోసం రూ.1,200 మీసేవ కేంద్రాల్లో ఈ నెల 16వ తేదీలోపు చెల్లించాలని సూచించారు.

బాలల జాతీయ సైన్స్ కాంగ్రెస్‌కు ఎంపిక

కరీంనగర్: 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ ప్రదర్శన హైదరాబాద్‌లోని జెనెటిక్స్ భవన్‌లో జరిగింది. పారమిత పాఠశాలకు చెందిన ఆరోతరగతి విద్యార్థి కె.ఋగ్వేద్ ప్రదర్శించిన వెండర్స్ ఫ్రెండ్లీ వెజిటేబుల్ కార్ట్ ప్రాజెక్టు జాతీయస్థాయికి ఎంపికైంది. టీఎస్ కాస్ట్ మెంబర్ సెక్రటరీ మారుపాక సతీశ్, ఐ.ఐ.సి.టి. పూర్వ సంచాలకులు కమల్, జెనెటిక్ విభాగం డైరెక్టర్ విజయలక్ష్మి, విద్యాశాఖ సంయుక్త సంచాలకులు పి.మదన్‌మోహన్ చేతులమీదుగా ఋగ్వేద్ ప్రశంసాపత్రం అందుకున్నాడు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి జయపాల్‌రెడ్డి, బాలల జాతీయ సైన్స్ కాంగ్రెస్ అకాడమిక్ కో–ఆర్డినేటర్ కేఎస్.అనంతాచార్య, గైడ్ టీచర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు. డీఈవో జనార్దన్‌రావు విద్యార్థిని అభినందించారు.

లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- 15 మందికి గాయాలు
- క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్


గాయపడిన ప్రయాణికులు


బస్సులో ఇరుక్కుపోయిన డ్రైవర్ మల్లయ్య

మానకొండూర్: లారీని ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో పలువురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. సూర్యాపేటకు చెందిన ఆర్టీసీ బస్సు మంగళవారం వేములవాడ నుంచి సూర్యాపేట వెళ్తోంది. మార్గమధ్యలో మానకొండూర్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ముందు వెళ్తున్న లారీని వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న జి.కమలమ్మ, భిక్షం, రమణ, బండపెల్లి పద్మతో సహా 15 మంది గాయపడ్డారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. డ్రైవర్ మల్లయ్య బస్సు క్యాబిన్‌లో ఇరుక్కుపోవడంతో అతికష్టమ్మీద బయటకు తీశారు. అనంతరం క్షతగాత్రులను కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

హత్యకేసులో నిందితుడి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ జీవన్‌రెడ్డి

ఇల్లందకుంట(హుజూరాబాద్): మండలంలోని కనగర్తి గ్రామ సర్పంచ్ అత్త హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. జమ్మికుంట రూరల్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏసీపీ జీవన్‌రెడ్డి సంబంధిత వివరాలు వెల్లడించారు. కనగర్తికి చెందిన రామంచ కుమార్‌కు దామెర మండలం లాదేల్ల గ్రామానికి చెందిన శ్రీలతతో కొన్ని నెలల క్రితం వివాహం జరిగింది. అయితే, దంపతుల మధ్య విభేదాలు రావడంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. కుమార్ పలుమార్లు అత్తగారింటికి వెళ్లి, తన భార్యను పంపాలని కోరగా వారు నిరాకరించారు. దీంతో ముద్యానికి బానిసయ్యాడు. సమస్య పరిష్కరించాలని సర్పంచ్ రజిత భర్త వాసుదేవరెడ్డికి విన్నవించాడు. ఇది మీ ఇంటి సమస్య కాబట్టి తాను జోక్యం చేసుకోనని ఆయన తెలిపాడు. దీంతో కుమార్ వాసుదేవరెడ్డిపై కక్ష పెంచుకున్నాడు. ఈ నెల 4న సాయంత్రం 5.30 గంటలకు పెట్రోల్, కారంపొడి, కత్తి బ్యాగ్‌లో పట్టుకొని, గ్రామ పంచాయతీ కార్యాలయం వద్దకు వెళ్లాడు. కార్యాలయ తలుపులపై పెట్రోల్ చల్లి, కాల్చే ప్రయత్నం చేయగా గ్రామస్తులు అడ్డుకున్నారు. అక్కడి నుంచి నేరుగా సర్పంచ్ ఇంటికి వెళ్లాడు. సర్పంచ్ అత్త లచ్చవ్వ తన ఇంటి ముందు ఒంటరిగా కూర్చొని ఉంది. ఇదే అదునుగా భావించి, ఆమెను కత్తితో విచక్షణారహితంగా దాడి చేయడంతో మృతిచెందింది. నిందితుడిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ పేర్కొన్నారు. కార్యక్రమంలో జమ్మికుంట రూరల్ సీఐ కిశోర్, ఇల్లందకుంట ఎస్‌ఐ రాజ్‌కుమార్, కానిస్టేబుల్ పాషా తదితరులు పాల్గొన్నారు.

'పారమిత'లో స్కౌట్స్ అండ్ గైడ్స్ దినోత్సవం


స్కౌట్స్ విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

కరీంనగర్: మంకమ్మతోటలోని పారమిత పాఠశాలలో మంగళవారం స్కౌట్స్ అండ్ గైడ్స్ దినోత్సవాన్ని జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వేడుకలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రశాంత్ పతాకావిష్కరణ చేసి, ప్రారంభించారు. విద్యార్థులు చేసిన కవాతు అందరినీ ఆకర్షించింది. పాఠశాల డైరెక్టర్లు వినోదరావు, హనుమంతరావు విద్యార్థులకు స్కార్ఫ్, బ్యాడ్జీలను అందజేశారు. పిల్లలు చేసిన పలు విన్యాసాలు అబ్బురపరిచాయి. కార్యక్రమంలో పారమిత విద్యాసంస్థల అధినేత ప్రసాద్‌రావు, ప్రధానోపాధ్యాయులు బాలాజీ, కవిత, స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యదర్శి కంకణాల రాంరెడ్డి, గైడ్స్ కెప్టెన్ రజిత, స్కౌట్స్ మాస్టర్లు రాజశేఖర్, టీచర్లు పాల్గొన్నారు.

భార్య కాపురానికి రావడం లేదని వ్యక్తి ఆత్మహత్య

తిమ్మాపూర్(మానకొండూర్): భార్య కాపురానికి రావడం లేదని మన్నెంపల్లికి చెందిన నాంపల్లి రాజు(29) ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ ప్రమోద్‌రెడ్డి కథనం ప్రకారం.. రాజు భార్య కవిత కుటుంబ కలహాల కారణంగా పుట్టింటికి వెళ్లిపోయింది. ఎన్నిసార్లు తిరిగి రావాలని కోరినా రాకపోవడంతో అతను మనస్తాపం చెందాడు. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. మృతుడి తండ్రి జగన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

మద్యానికి బానిసై మరొకరు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని దుర్శేడ్‌కు చెందిన భూతం రాయలింగు(48) ఆత్మహత్య చేసుకున్నాడు. రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. రాయలింగు కూలీ పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. గత ఆరు నెలలుగా మద్యానికి బానిసై, పనికి వెళ్లకుండా ఖాళీగా ఉంటున్నాడు. సోమవారం రాత్రి 11 గంటల సమయంలో అతిగా మద్యం సేవించి, ఆ మత్తులో ఇంట్లోనే ఉరేసుకున్నాడు. మంగళవారం ఉదయం అతని భార్య లక్ష్మి లేచి చూడగా మృతిచెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. మద్యానికి బానిసై, జీవితంపై విరక్తితో తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడని అతని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రదీప్‌కుమార్ పేర్కొన్నారు.

అదృశ్యమై.. వ్యవసాయ బావిలో శవమై

- లస్మన్నపల్లిలో ఘటన

సైదాపూర్: అదృశ్యమైన ఓ వ్యక్తి వ్యవసాయ బావిలో శవమై తేలాడు. పోలీసులు, గ్రామస్తుల వివరాల ప్రకారం.. సైదాపూర్ మండలంలోని లస్మన్నపల్లికి చెందిన కొట్టె శ్రీకాంత్‌రెడ్డి(34) భార్య ప్రణీత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆమె పిల్లలతో కలిసి తన పట్టింటికి వెళ్లింది. శ్రీకాంత్‌రెడ్డి సోమవారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. రాత్రయినా తిరిగి రాలేదు. అయితే, అతను కనిపించడం లేదని సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. వెన్నంపల్లికి చెందిన రైతు ప్రభాకర్‌రెడ్డి మంగళవారం తన వ్యవసాయ బావిలో నీళ్లు ఏ మేరకు ఉన్నాయోనని తొంగి చూశాడు. అతనికి అందులో శ్రీకాంత్‌రెడ్డి మృతదేహం కనిపించింది. పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని బయటికి తీయించారు. బహిర్భూమికి వెళ్లి, ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందినట్లు మృతుడి భార్య ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఆరోగ్యం తెలిపారు.

చెట్టును ఢీకొట్టి.. ఇంట్లోకి దూసుకెళ్లి

- వెల్లుల్లలో వ్యాన్ బీభత్సం
- తప్పిన ప్రమాదం
- భారీ శబ్దానికి ఉలిక్కిపడ్డ స్థానికులు


ఇంటిని ఢీకొట్టి లోనికి దూసుకొచ్చిన వాహనం


ఇంటిని ఢీకొట్టిన వ్యాన్

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం వెల్లుల్లలో డీసీఎం వ్యాన్ బీభత్సం సృష్టించింది. వివరాల్లోకి వెళ్తే... సోమవారం రాత్రి కేసీఆర్ తండా నుంచి ధాన్యం లోడుతో వెళ్తున్న వాహనం గ్రామ శివారులోని క్రాసింగ్ వద్ద చెట్టును ఢీకొట్టి ఓ ఇంట్లోకి దూసుకెళ్లగా ఒకవైపు గోడ కూలింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. భారీ శబ్దానికి స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

కాపర్ వైర్ చోరీ

కథలాపూర్: మండలకేంద్రంలోని శివారులో వ్యవసాయ విద్యుత్ మోటార్ల కాపర్ వైర్లను దొంగలు ఎత్తుకెళ్లినట్లు రైతులు తెలిపారు. కథలాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏరియాలోని పలువురు రైతులకు చెందిన పది విద్యుత్‌మోటార్ల కాపర్ వైరును దొంగలు ఎత్తుకెళ్లారు. అధికారులు వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

రేపు ఇంటర్వ్యూ

జగిత్యాలటౌన్: దుబాయ్ (యూఏఈ)లో ఉద్యోగాల కోసం టామ్‌కాం, ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి బి. సత్యమ్మ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. యూఏఈలోని కన్‌స్ట్రక్షన్ కంపెనీలో క్లీనర్స్, ఏసీ టెక్నీషియన్స్, ఎలక్ట్రీషియన్స్, ప్లంబర్స్,పెయింటర్స్, కార్పెంటర్స్, మేషన్స్ తదితర ఉద్యోగాల కోసం ఈనెల 7న ఉదయం 11 గంటలకు సమీకృత కలెక్టర్ కార్యాలయ సముదాయంలోని రెండో అంతస్తులో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు సంబంధిత ధ్రువపత్రాలతో హాజరుకావాలని కోరారు. క్లీనర్స్ పోస్ట్ మినహాయించి ఇతర ఉద్యోగాలకు రెండేళ్ల నుంచి మూడేళ్ల అనుభవంతో పాటు, తదితర ధ్రువపత్రాలతో హాజరుకావాలన్నారు.

కోర్టు ఆవరణలో వ్యక్తి ఆత్మహత్యాయత్నం


పోశంను ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు

గోదావరిఖనిటౌన్: గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోర్టు కాంప్లెక్స్ ఆవరణలో స్థానిక రాజీవ్‌నగర్‌కు చెందిన మేకల పోశం అలియాస్ గ్యాస్ పోశం ఆత్మహత్యాయత్నం చేశాడు. పోలీసుల కథనం ప్రకారం.. పోశంకు రాజీవ్‌నగర్‌కే చెందిన మహేశ్‌తో పాత గొడవలున్నాయి. ఈ నెల 3న ఇద్దరూ గొడవ పడ్డారు. మహేశ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో పోశం మంగళవారం కోర్టు ఆవరణలోకి వచ్చి, వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకున్నాడు. తనకు న్యాయం చేయాలంటూ నిప్పంటించుకునే ప్రయత్నం చేయగా అక్కడే విధుల్లో ఉన్న ఎస్పీపీసీ రాణా కానిస్టేబుల్ పురుషోత్తం, వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ అలీ, కోర్టు హోంగార్డు నాగేశ్వర్‌రావులు అడ్డుకున్నారు. వెంటనే అతన్ని ఆస్పత్రికి తరలించి, బాధిత కుటుంబసభ్యులకు సమాచారం అందించారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

యైటింక్లయిన్‌కాలనీ: స్థానిక సంతోష్‌నగర్ ఏరియాలోని కేజీబీవీ పాలకుర్తి పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని కె.మానిక ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల స్పెషల్ ఆఫీసర్ స్వరూప తెలిపారు. ఈ నెల 4న అండర్–17 విభాగంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి 1.5 కిలోమీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు వరంగల్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననుందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని స్పెషల్ ఆఫీసర్‌తోపాటు పీఈటీ రాజేశ్వరి, టీచర్లు మంగళవారం అభినందించారు.

ఎన్నికల సేన 2.0


కౌంటింగ్ ప్రక్రియను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి (ఫైల్)

- ముందస్తు కార్యాచరణతో యంత్రాంగం సఫలం
- చెదురుమదురు ఘటనలు మినహా అంతా ప్రశాంతం
- సకల సౌకర్యాలు.. ప్రత్యేక కేంద్రాల్లో పెరిగిన పోలింగ్‌శాతం

జిల్లాల వారీగా పోలింగ్ శాతమిలా	
ఉమ్మడి జిల్లా పోలింగ్‌శాతం:	76.00
కరీంనగర్:	75.64
పెద్దపల్లి:	75.62
జగిత్యాల:	76.12
రాజన్న సిరిసిల్ల:	75.92

నియోజకవర్గాల వారీగా నమోదైన పోలింగ్‌శాతం	
కరీంనగర్:	62.93
మానకొండూరు:	81.33
హుజూరాబాద్:	80.62
చొప్పదండి:	77.68
కోరుట్ల:	75.62
జగిత్యాల:	74.12
ధర్మపురి:	79.01
సిరిసిల్ల:	73.42
వేములవాడ:	78.43
మంథని:	79.14
రామగుండం:	68.74
పెద్దపల్లి:	81.40

కరీంనగర్ అర్బన్: తెలంగాణ శాసన సమరంలో అభ్యర్థుల జయాపజయాలు పక్కనబెడితే ఉద్యోగుల పాత్ర అమోఘం. రాత్రనక, పగలనక శ్రమించిన తీరు అభినందనీయం. ప్రకటన వెలువడిన దరిమిలా జిల్లా యంత్రాంగం తీసుకున్న చర్యలు, ముందస్తు కార్యాచరణ ఎన్నికల మెరుగైన నిర్వహణకు దోహదపడ్డాయి. అటెండర్ నుంచి కలెక్టర్ వరకు ఎన్నికల్లో భాగస్వాములు కాగా పక్కా ప్రణాళికతో బేష్ అనిపించారు. ఉమ్మడి జిల్లాలో చెదురుముదురు ఘటనలు మినహా ప్రశాంతంగా నిర్వహించారు. పలు చోట్ల ఓట్లు గల్లంతవడం.. పోల్ చీటీలు రాకపోవడం కొంత ఆందోళన కలిగించింది. వెరసి 2023 ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగింది.

కలెక్టర్ల పాత్ర అభినందనీయం

ఉమ్మడి కరీంనగర్ పరిధిలోని నాలుగు జిల్లాల ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన కలెక్టర్ల పాత్ర అభినందనీయం. కలెక్టర్లు పమేలా సత్పతి(కరీంనగర్), అనురాగ్ జయంతి(రాజన్నసిరిసిల్ల), ముజమ్మిలాఖాన్(పెద్దపల్లి), షేక్ యాస్మిన్ బాషా(జగిత్యాల)లు ఎన్నికల నిర్వహణలో సఫలమయ్యారు. ఎన్నికల సంఘం నుంచి ఆదేశాలను కిందిస్థాయి సిబ్బంది వరకు చేరవేరవేయడంలో పకడ్బందీ చర్యలు తీసుకున్నారు. శాంతిభద్రతల పర్యవేక్షణలో వీరికి అయా జిల్లాల సీపీలు, ఎస్పీలు సహకారం అందించారు. ఫలితంగా ఎన్నికలలో కీలకఘట్టమైన పోలింగ్ ప్రశాంతంగా ముగియగా ఓట్ల లెక్కింపు పారదర్శకంగా నిర్వహించారు.

నిర్వహణలో ప్రధాన శాఖలు ఇవే..

ఎన్నికల విజయవంతం అయ్యాయంటే రెవెన్యూ పాత్ర కీలకం కాగా దీనికితోడు సుమారు 20శాఖలకు పైగా ఉద్యోగులు తమవంతు పాత్ర పోషించారు. ఓటరు నమోదు మొదలుకుని పోలింగ్ పూర్తయి.. ఓట్ల లెక్కింపు వరకు కీలక భూమిక పోషించారు. యువత ఓటెత్తగా పట్టణాల్లోనూ పలు పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్‌శాతం పెరిగింది. రెవెన్యూ, విద్యాశాఖ, కేంద్ర, రాష్ట్ర పోలీసు బలగాలు, ఎక్సైజ్, మహిళా సంక్షేమం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, రవాణా, ఆర్టీసీ, సర్వే లాండ్ రికార్డ్స్, సహకార ఆడిట్ విభాగం, వీటి పారుదల, రోడ్లు, భవనాలు, ట్రెజరీ, బీఎస్ఎన్ఎల్, బ్యాంకింగ్, వైద్య ఆరోగ్యశాఖ, యువజన సంక్షేమ, ఇంటర్మీడియట్, తదితర శాఖలు, ఆయా కళాశాలల ఉద్యోగులు ఎన్నికల సేనలో ఉన్నారు.

గురువులు కీలకులే

ఎన్నికల ప్రక్రియ అంతా ఒక ఎత్తయితే పోలింగ్ మరో ఎత్తు. ఆ పోలింగ్‌ను విజయవంతంగా నిర్వహించడంలో ఉపాధ్యాయుల పాత్ర ప్రశంసనీయం. గత నెల 29, 30 తేదీల్లో వారు నిద్రలేని రాత్రులు గడిపి ఎన్నికల సమరాన్ని గట్టెక్కించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 13,185 మంది ఉపాధ్యాయులు ఈ క్రతువులో పాల్గొన్నారు.

యువత భాగస్వామ్యం

పాలిటెక్నిక్ విద్యార్థులు, మీ సేవ కేంద్రాల నిర్వాహకులు, మండల, జిల్లా కార్యాలయాల్లో పనిచేసే కంప్యూటర్ ఆపరేటర్లకు పోలింగ్ చిత్రీకరణ పనులు అప్పజెప్పారు. వారూ కేంద్రాలకు వెళ్లి ఉదయం నుంచి పోలింగ్ ముగిసే వరకు వీడియో చిత్రీకరణ చేసి ఎన్నికల సంఘానికి ఎప్పటికప్పుడు ప్రత్యక్ష ప్రసారం అందించడంలో కీలక భూమిక పోషించారు. ఈ ప్రక్రియలో ఉమ్మడిజిల్లావ్యాప్తంగా 2,500 మంది యువత సాంకేతిక జోడింపులో పాత్ర పోషించారు. బీఎల్వోలు, ఆశాకార్యకర్తలు, ఎఎన్ఎంలు ఓటరు జాబితా రూపకల్పనలో ఓటర్లకు పోల్ చీటీలు పంచి వారిని పోలింగ్ కేంద్రానికి చేర్చడంలో కీలక పాత్ర పోషించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మూడు వేల సిబ్బంది రెండునెలలకు పైగా తీరిక లేకుండా క్షేత్రస్థాయిలో పని చేశారు.

ప్రత్యేక సేవల్లో సంక్షేమ, డీఆర్డీఏ

ఓటుహక్కు ఉన్న దివ్యాంగులు, వృద్ధులకు ఇంటి వద్దే ఓటింగ్ సౌకర్యం కల్పించగా జిల్లా సంక్షేమ శాఖ, డీఆర్డీఏ, పరిశ్రమలశాఖ విశేష కృషి చేసింది. ఇంటింటికీ వెళ్లి ఓటుహక్కు వినియోగించుకునేలా శ్రమించారు. నడిచేవారు, ఆరోగ్యంగా ఉన్న వృద్ధులను పోలింగ్ కేంద్రాలకు తీసుకురావడం, తిరిగి వారిని ఇంటి వద్దకు చేర్చడంలో వలంటీర్ల కృషి అభినందనీయం. అంగన్‌వాడీలు గర్భిణులు, బాలింతలతో ఓటు వేయించడంలో చొరవ చూపారు.

పటిష్ట భద్రత

ఒకప్పుడు మావోయిస్టు, జనశక్తి ప్రభావిత ప్రాంతంగా ముద్రపడ్డ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఇప్పుడు ఆ ప్రభావం అంతగా లేకపోయినా పోలింగ్ రోజున ఎలాంటి సమస్య తలెత్తకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టారు. అభిషేక్ మహంతి(కరీంనగర్ సీపీ) అఖిల్ మహాజన్(రాజన్నసిరిసిల్ల ఎస్పీ) రెమో రాజేశ్వరి(పెద్దపల్లి సీపీ), సన్‌ప్రీత్‌సింగ్(జగిత్యాల ఎస్పీ)ల సమక్షంలో జిల్లా పోలీసులతో పాటు బలగాలు, పారామిలటరీ సైనికులు బందోబస్తు నిర్వహించారు.

ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక


బాస్కెట్‌బాల్ ఎంపిక పోటీల్లో క్రీడాకారులు

జగిత్యాలటౌన్: జగిత్యాల వివేకానంద మినీస్టేడియంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా అండర్ 14, 17 ఏళ్ల బాలబాలికల బాస్కెట్‌బాల్ జట్లను మంగళవారం ఎంపిక చేశారు. పోటీల్లో కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్ల జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి లక్ష్మీరాంనాయక్ తెలిపారు. ఈ పోటీల నిర్వహణలో పీడీలు, పీఈటీలు పడాల విశ్వప్రసాద్, కృష్ణప్రసాద్, అశోక్, అజయ్‌బాబు, వేణు, వెంకటలక్ష్మి, కోచ్ శ్రీరాం పాల్గొన్నారు.

వైద్య సేవల మెరుగునకు సీపీడీ దోహదం

కోల్‌సిటీ(రామగుండం): వైద్య సేవలను మరింత మెరుగుపర్చడానికి గోదావరిఖనిలోని సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(సిమ్స్) నిర్వహించిన నిరంతర వృత్తి వికాస కార్యక్రమం (సీపీడీ) వైద్యులకు దోహదపడుతుందని రాష్ట్ర వైద్య విద్య సంచాలకులు(డీఎంఈ) డాక్టర్ రమేశ్‌రెడ్డి అన్నారు. కాలేజీ యాజమాన్యం తొలిసారి సిమ్స్ ప్రొఫెసర్లతోపాటు రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు చెందిన వైద్యులకు మంగళవారం సిమ్స్ ఆధ్వర్యంలో హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధి నిర్మూలన, మెరుగైన వైద్య సేవలపై కంటిన్యూస్ మెడికల్ ఎడ్యుకేషన్(సీఎంఈ) కార్యక్రమం నిర్వహించింది. దీన్ని డాక్టర్ రమేశ్‌రెడ్డి హైదరాబాద్ నుంచి ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించారు. కార్యక్రమాన్ని వైద్యులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్, డీసీహెచ్ఎస్ రమాకాంత్, డిప్యూటీ డీఎంహెచ్‌వో కృపాబాయి, కళాశాల నిర్వాహకులను అభినందించారు. సిమ్స్ ప్రిన్సిపాల్ హిమబిందు సింగ్ మాట్లాడుతూ.. సీఎం ఈ కార్యక్రమానికి కళాశాలకు చెందిన ప్రొఫెసర్లు, జీజీహెచ్ వైద్యులు, గోదావరిఖనిలోని పలువురు ప్రైవేట్ డాక్టర్లతోపాటు కరీంనగర్, మంచిర్యాల, నిజామాబాద్ జిల్లాల నుంచి 150 మంది వైద్యులు హాజరైనట్లు తెలిపారు. వీరికి తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ ద్వారా రెండు క్రెడిట్ అవర్స్ సర్టిఫికెట్లు అందిస్తామన్నారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనకు చేసిన పరిశోధనల్లో ఇప్పటివరకు వచ్చిన మెరుగైన ఫలితాలు, భవిష్యత్తు పోకడలు, వైద్య సేవలు మెరుగుపడిన తీరు తదితర అంశాలపై వైద్య నిపుణులు వివరించారు. దేశవ్యాప్తంగా ఐదుగురు హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా మందులను వాడటం ద్వారా వ్యాధిని జయించారని తెలిపారు. అనంతరం ఏఆర్టీ విభాగం వైద్యులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ దయాల్‌సింగ్, సిమ్స్ ప్రొఫెసర్లు అరుణ, అశోక్, శ్రీదేవి, భాగ్యలక్ష్మి, అనంతబాబు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రలోభ పెట్టినా కాంగ్రెస్‌దే విజయం


మాట్లాడుతున్న మహేశ్

రామగుండం: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఓటర్లను బీఆర్ఎస్ పార్టీ ఎన్నో రకాలుగా ప్రలోభాలకు గురిచేసిందని కాంగ్రెస్ బీసీ సెల్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేశ్ ఆరోపించారు. అయినా, వారు కాంగ్రెస్‌కు ఓటు వేసి, మక్కాన్‌సింగ్ ఠాకూర్‌ను భారీ మెజారిటీతో గెలిపించారని అన్నారు. మంగళవారం అంతర్గాం ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారిస్తామని ఎమ్మెల్యే చెప్పారన్నారు. ప్రతీ గ్రామంలో పర్యటిస్తూ ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. పార్టీ మండల ఇన్‌చార్జి పెంద్రు హన్మాన్‌రెడ్డి, నాయకులున్నారు.